నకిలీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలి

- ఎక్సైజ్ మంత్రి, అధికారులను వెనుకేసుకొస్తున్న కూటమి
- సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు బయటకొస్తాయి
- నకిలీ మద్యంపై రణభేరి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ త్వరితగతిన విచారణ జరిపించాలని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ మద్యం విధానానికి వ్యతిరేకంగా, నకిలీ మద్యం వ్యవహారంపై రణభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు ఆధ్వర్యంలో నారా వారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీతారామపురంలోని విజయవాడ వెస్ట్ ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నకిలీ మద్యంపై నైతిక బాధ్యత వహిస్తూ ఎక్సైజ్ శాఖామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పర్మిట్ రూంలు రద్దు చేయాలని.. నకిలీ మద్యం అరికట్టాలని.. ఎన్ బ్రాండ్ మద్యంతో ప్రజల ప్రాణాలకు హాని అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

నకిలీ మద్యంతో ప్రజారోగ్యం దెబ్బ..

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నకిలీ మద్యం విలయతాండవం చేస్తోందన్నారు. నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. సంబంధిత కేసులో దొరికిన వ్యక్తి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. రాష్ట్రంలోని మహిళలు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నకిలీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. కానీ సీఎం చంద్రబాబు కంటితుడుపు చర్యగా సిట్ పాటపాడుతోందన్నారు. గతంలోనూ కూటమి ప్రభుత్వం విశాఖ భూముల వ్యవహారంతో పాటు మరికొన్ని విషయాల్లోనూ సిట్ వేసిందని.. కానీ దాని వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని విమర్శించారు. పోలీస్, రెవెన్యూ అధికారం మీ చేతిలోనే ఉన్నా.. ఎక్కడా నకిలీ మద్యం ఆగిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోనే నకిలీ మద్యం వ్యవహారం నడుస్తోందని మండిపడ్డారు. దీనిని వైఎస్సార్‌సీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైంది కాదని పేర్కొన్నారు.

సీబీఐ విచారణకు నిరాకరణ..

ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో జరిగిన నకిలీ తతాంగంపై పారదర్శకంగా విచారణ జరగాలంటే కచ్చితంగా సీబీఐ విచారణ జరిపించాలని మల్లాది డిమాండ్ చేశారు. నకిలీ మద్యం వ్యవహారం వెనుక ఉన్న టీడీపీ వాళ్లను రక్షించడం కోసం సీబీఐ విచారణకు కూటమి నిరాకరిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ మంత్రిని, అధికారులను ప్రభుత్వం వెనుకేసుకొస్తోందన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. నకిలీ మద్యం తాగిన ప్రజలు చనిపోతున్నారన్నారు. మహిళల తాళిబొట్లు తెగిపోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ జె.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అవుతు శ్రీనివాసరెడ్డి, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, కార్పొరేటర్లు కుక్కల అనిత, యరగొర్ల తిరుపతమ్మ, ఇసరపు దేవి, కొండాయిగుంట మల్లేశ్వరి, బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, మహిళా విభాగం నాయకులు త్రివేణి రెడ్డి, తోపుల వరలక్ష్మీ, నాయకులు కాలే పుల్లారావు, గుండె సుందర్‌పాల్, ఇసరపు రాజు, బందెల కిరణ్‌రాజ్, విజయలక్ష్మీ, వరలక్ష్మీ, బోగాది మురళి, పిల్లుట్ల వంశీ, బంకా బాబి, వెన్న రత్నారావు, బంకా నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, ఆదినారాయణ, మహేష్, నాగాంజనేయులు, గంగాధరరావు, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఛిద్రం.. చోదకుల ఆవేదన!


ఛిద్రంగా వినాయక నగర్ డొంక రోడ్డు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): 30వ డివిజన్ వినాయక నగర్ నుంచి డొంక రోడ్డుకు వెళ్లే మార్గం మలుపులో రోడ్డు ఛిద్రమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. కనీసం మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పలు నిర్మాణాలు అధికంగా జరుగుతుండడంతో భారీ వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని.. రోడ్డుకు కనీస మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మూడు చక్రాల మోటర్ బండి పంపిణీ



మధురానగర్(విజయవాడ సెంట్రల్): క్షయ వ్యాధితో బాధపడుతున్న వెంకటరమణకు లయన్స్‌క్లబ్ ఫస్ట్ వైస్ గవర్నర్ నెక్కంటి ప్రసాద్ మూడు చక్రాల మోటర్ బండిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరమణకు వ్యాపారం చేసుకునేందుకు గానూ తనవంతు సాయంగా బండి అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంఫాక్ట్ నాయకులు పీవీఆర్, అంగిరేకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగరంలోని మధురానగర్, పసుపుతోట, జీవీఆర్‌నగర్, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు దోమల ఉధృతికి ఆవాసాలంటూ సోమవారం 'కలవర పెడుతున్న ఖాళీ స్థలాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. నగరపాలక సంస్థ మలేరియా విభాగం సిబ్బంది దీనిపై స్పందించారు. దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఖాళీ స్థలాలు, మురుగు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, దోమల నివారణ మందు, తాజా నీటి నిల్వల ప్రాంతంలో గంబూసియా చేపలను వేశారు. కాగా తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీ నాయుడు హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి

రాష్ట్రకాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రకాశం జిల్లాలో జరిగిన లక్ష్మీ నాయుడు హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని కాపు జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రకాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్ మాట్లాడుతూ.. లక్ష్మీ నాయుడి హత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ నాయుడు హత్య బలిజ కాపు వర్గాలపై జరిపిన దాడిగా భావిస్తున్నామని.. హత్య అనంతరం జరిగిన పరిణామాలు ఆ విధానాన్ని సూచిస్తున్నాయని ఆయన అన్నారు. ఘటనపై విచారణ జరిపి నివేదిక తెప్పించి కుట్ర దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్తాచాటిన మైక్రోబయాలజీ పీజీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐఎఎంఎంటీఏపీసీ వార్షిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో పాల్గొన్న ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం పీజీలు వివిధ అంశాల్లో సత్తాచాటారు. అందులో భాగంగా డాక్టర్ పి. సాయి అవినాష్ మైక్రోబయాలజీలో కృష్ణారావు మెమోరియల్ ఉత్తమ మౌఖిక ప్రదర్శనలో రెండవ బహుమతి గెలుపొందారు. డాక్టర్ అబ్దుల్ రజాక్ – క్విజ్ పోటీలో మూడవ స్థానం పొందారు. కాగా డాక్టర్ అశ్విని కిరణ్, డాక్టర్ డి. రాధాదేవి, డాక్టర్ ఎం. విశ్వనాథ్ ప్రజెంటేషన్‌లో 110 మంది విద్యార్థులు పాల్గొనగా టాప్ 10 లో స్థానం పొందారు. ఈ సందర్భంగా వారిని సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

గుణదల(విజయవాడ తూర్పు): గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసిన ఘటనలో మాచవరం పోలీసులు 9 మందిని అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి చుట్టగుంట వద్ద గల ఓ ప్రైవేటు భవనంలో పెద్ద ఎత్తున పేకాట జరుగుతోందని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది పేకాటరాయళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద గల సెల్‌ఫోన్ లతో పాటు రూ.1,21,070 స్వాధీనం చేసుకుని మాచవరం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి హేయం

తిరువూరు: గంపలగూడెం మండలం సొబ్బాలలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి గర్హనీయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ తోరణాలు కట్టిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కర్రలతో దాడికి పాల్పడటం హేయమైన చర్యన్నారు.

రహదారులపై నిలిచిన వర్షం నీరు


పసుపుతోటలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


డీమార్ట్ సమీపంలో పరిస్థితి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగరంలో సోమవారం కురిసిన వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే సాంబమూర్తి రోడ్డు డీమార్ట్ సమీపంలో, పసుపుతోట వాటర్ ట్యాంక్, మాచవరం, దుర్గాపురం తదితర ప్రాంతాలలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్లు అపరిశుభ్రంగా మారడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై వర్షపునీరు నిలువకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


మాట్లాడుతున్న పి.భానుమతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు నిత్యం సమతుల్య ఆహారం తీసుకుంటూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ విజయవాడ రూరల్ సీడీపీవో పి.భానుమతి చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో తరుణీ తరంగాలు సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ పోషకాహారం–పరిసరాల పరిశుభ్రత అనే అంశంపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. భానుమతి మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు, బాలింతలు నిత్యం గుడ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు తీసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా అనేక జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చునని చెప్పారు. పోషకాహారంతో పాటుగా ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యానికి గురవ్వుతారన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలమైన ఆహారాన్ని ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.
జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ మహిళల నిత్య జీవితంలో పోషక ఆహారానికి, పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చాలా చౌకగా లభించే ఆకుకూరలు, కూరగాయల్లో చాలా పోషకాలు ఉంటాయన్నారు. పనిచేసే చోటు కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సదస్సు అనంతరం పోషక ఆహారానికి సంబంధించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, జ్యూస్‌లను ప్రదర్శించారు. తరుణీ తరంగాలు సంస్థ సభ్యుల తోపాటుగా జనశిక్షణ సంస్థాన్‌లో శిక్షణకు హాజరైన సభ్యులు పాల్గొన్నారు.

భారత్‌పై ట్రంప్ టారిఫ్ యుద్ధాన్ని వ్యతిరేకించాలి

సీపీఎం నగర కమిటీ కార్యదర్శి సత్యబాబు



ట్రంప్ సుంకాల యుద్ధం ప్రచార పుస్తకాలని ఆవిష్కరిస్తున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): దేశ వ్యవసాయ రంగం, చిన్న, మధ్య తరగతి పారిశ్రామిక రంగాన్ని దివాలా తీసున్న సామ్రాజ్యవాద ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ కేంద్ర కమిటీ పిలుపు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు తెలిపారు. కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో ట్రంప్ సుంకాల యుద్ధం ప్రచార పుస్తకాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ, పాడిపరిశ్రమలు, కోళ్ల పరిశ్రమలు, పత్తి, పప్పు దినుసులు, రబ్బరు, జీడిపప్పు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, దస్తులు, వస్త్ర పరిశ్రమ, ఆక్వా ఎగుమతులపై ట్రంప్ సామ్రాజ్యవాదం విధించిన 50 శాతం సుంకాల ప్రభావం దేశ అభివృద్ధికి ఆటంకంగా మారిందని చెప్పారు. వీటి ప్రభావం కోట్లాది మంది భారతీయులపై పడుతుందని పేర్కొన్నారు. తద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతిని నిరుద్యోగం పెరిగి, ఆదాయాలు తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే ప్రమాదం ఉందన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే హెచ్‌బీవన్ వీసాల జారీ కఠిన నిర్ణయాలు దేశ ప్రజానీకాన్ని అవమానించి వెల్లగొట్టే విద్వేషచర్యలను ఖండించాలన్నారు. ఇటువంటి పరిస్థితిలో ట్రంప్ టారిఫ్ టెర్రరిజంపై ప్రధాని మోడి నోరు మెదకపోవడం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సురిబాబు, నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

17న సిద్ధార్థ ఆడిటోరియంలో నవోన్మేషికోత్సవ్


పోస్టర్ ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 17వ తేదీ సిద్ధార్థ ఆడిటోరియంలో నవోన్మేషికోత్సవ్-2025 పేరుతో అంతర్రాష్ట్ర సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. స్థానిక కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కర్ణాటక గాత్రం సోలో, శాస్త్రీయ వాద్యం, బృందగానం, జానపద గేయాల ఆలాపన, ఫోక్ గ్రూప్ డాన్స్, శాస్త్రీయనృత్యం, స్కిట్, మైమ్, మిమిక్రీ అంశాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల తోపాటుగా ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేశ్ సి. జంపాల, కళాశాల కల్చరల్ విభాగం కమిటీ ఉపాధ్యక్షులు జయప్రకాష్, ఎం.శివరంజనితో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

పెనమలూరు: యనమలకుదురులో గ్రామంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఆజం చిహ్నమైన జెండాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఇందిరానగర్ నుంచి జెండా చెట్టు వరకు ఊరేగించారు. అనంతరం జెండాలను ఇందిరానగర్ జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 4 వేల మందికి అన్నసమారాధన చేశారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పూడికతీత పనులు చేపట్టాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలో వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండకుండా విస్తృతంగా డీసిల్టింగ్ పనులను చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అధికారులను ఆదేశించారు. వన్ టౌన్ నైజాం గేట్ పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు డ్రైయిన్లను పర్యవేక్షిస్తుండాలని సూచించారు. పాత రాజరాజేశ్వరి పేట రైల్వే గేట్ వద్దన్న డ్రెయిన్‌ను డ్రోన్ ద్వారా పరిశీలించి త్వరగా నిర్మాణ పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. డ్రెయిన్‌లో నుంచి తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు రోడ్డుపై కాకుండా వాటిని అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. లేదంటే అవి మళ్లీ అదే డ్రెయిన్లలో పడి సమస్య పునరావృతం అవుతుందన్నారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో హార్ట్ ఎటాక్ వచ్చిన వారిని ఆస్పత్రిలో చేర్చేలోపు సీపీఆర్ ద్వారా విలువైన ప్రాణాలను ఎలా కాపాడటంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రసవం జరిగినప్పుడు పుట్టిన బిడ్డకు సీపీఆర్ ఏ విధంగా చేయాలో చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సల్మా సిబ్బందికి వివరించారు. సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ వరకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సీపీఆర్‌తో అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. డాక్టర్ రేచల్, ఫిజియోథెరపిస్ట్ సృజన, హెడ్ నర్సు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ వికాసం

డీఈవో యు.వి.సుబ్బారావు


క్రీడా జ్యోతిని వెలిగించిన డీఈవో సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతోందని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. చిట్టూరి హైస్కూల్ క్రీడా దినోత్సవం సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు క్రీడా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, పోటీ తత్వం, ఓటమిని ఎదుర్కొనే లక్షణం, సమాచార ప్రసార నైపుణ్యాలు వంటి ఉత్తమ లక్షణాలు అలవాటవుతాయన్నారు. సెక్రటరీ డి.సుజాత మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తి విద్యార్థుల్లో వ్యక్తిత్వాన్ని పెంచుతుందన్నారు. శుక్రవారం వరకూ పోటీలు జరుగుతాయని, మొత్తం 1,200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ పి.హారిక వివరించారు. సోమవారం సీనియర్స్ విభాగంలో ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు స్కేటింగ్‌లో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ యు.వి.పుల్లారావు పాఠశాల క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి మాడుగుల వరప్రసాద్, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ ఆడిటర్ గుండా గంగాధర్, పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ నజియా, యామిని పాల్గొన్నారు.

●భళారే వి'ఛత్రం'







నగరంలో సోమవారం కురిసిన చిరుజల్లులకు ప్రజలు కాస్త ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారు వర్షం ధాటికి ముందుకు వెళ్లలేక రోడ్డు పక్క తమ వాహనాలను నిలుపుదల చేశారు. కాగా పలువురు ప్రయాణికులు ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని చోదకుడిపై చినుకు పడకుండా తమ వద్ద గల ఛత్రం అడ్డు పెట్టారు. బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలో కనిపించిన అలాంటి చిత్రాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సమస్యలు పునరావృతం కాకూడదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని, అదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఆయన 13 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో పట్టణ ప్రణాళికపై -5, హార్టికల్చర్‌పై -1, ఇంజినీరింగ్‌పై -7 ఫిర్యాదులను అందుకున్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానెర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యకుమారి, ఇన్‌చార్జ్ పర్యవేక్షణ ఇంజినీర్లు శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ అమత్ డాక్టర్ లత, డెప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం


ఉపాధ్యాయులకు సేవా పుస్తకాలు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

గన్నవరం: మండలంలోని పలు పాఠశాలలో నియమితులైన ఆరుగురు కొత్త ఉపాధ్యాయులకు సోమవారం యూటీఎఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వీరికి సేవా పుస్తకాలు, యూటీఎఫ్ సభ్యత్వ పత్రాలను ఆ సంఘ నాయకులు అందజేశారు. దావాజిగూడెం, గన్నవరం, గొల్లనపల్లి హైస్కూల్‌లో కొత్త ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా కొత్తగా చేరిన వారికి యూటీఎఫ్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. విధులను నిర్వర్తించడంలో ఏ విధమైన అవసరం ఉన్నా తమ సంఘం ఎలప్పుడు తోడుగా ఉంటుందన్నారు. సంఘ నాయకులు జీవీ రవిబాబు, తాతా శ్రీనివాసరావు, డి.కుమార్, ఎన్.సుజశ్రీ, డి.బాలసుబ్బమ్మ, సీహెచ్ రత్నకుమారి పాల్గొన్నారు.